క్లుప్తంగా

గిరిజన గురుకుల కళాశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలను శుక్రవారం ఆర్డీవో హనుమా నాయక్‌ తనిఖీ చేశారు. కళాశాలలో అమలవుతున్న మెనూపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ శ్రీలత ఉన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి



గోదావరిఖని: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని నిరసిస్తూ శనివారం గోదావరిఖనిలో నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ హిందువులకు సంబంధం లేకపోయినా అవకాశం వచ్చినప్పుడల్లా హిందువుల మీద దాడులు చేయడం దిగ్భ్రాంతిని కలిగిస్తోందన్నారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌లో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వ్యాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్‌ కవర్లను డ్రైనేజీలో వేయొద్దు

సుల్తానాబాద్‌: ప్రజలు ప్లాస్టిక్‌ కవర్లను మురికి కాలువలో వేయొద్దని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గాజుల లక్ష్మి అన్నారు. శుక్రవారం స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమంలో భాగంగా పలు కాలనీలను వారు సందర్శించారు. మురుగు నిలిచిన డ్రైనేజీలను జేసీబీల సహకారంతో శుభ్రం చేసినట్లు ఆమె తెలిపారు. మున్సిపల్‌ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు జీజీహెచ్‌లో డాక్టర్ల సమ్మె

కోల్‌సిటీ: కోల్‌కతాలో జూనియర్‌ డాక్టర్‌ను అత్యాచారం చేసి చంపిన ఘటనకు నిరసనగా శనివారం గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌)లో ఓపీ సేవలను నిలిపివేస్తున్నట్లు వైద్యులు ప్రకటించారు. అత్యవసర సేవలను మాత్రం యధావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. కాగా దేశవ్యాప్తంగా శనివారం చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో జీజీహెచ్‌ ఆస్పత్రి వైద్యులతోపాటు సింగరేణి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌(సిమ్స్‌) కాలేజీ మెడికోలు సైతం నిరసన చేపట్టడానికి నడుం బిగించారు. సిమ్స్‌ కాలేజీ నుంచి ర్యాలీ, అనంతరం జీజీహెచ్‌ ముందు రాస్తారోకో చేపట్టడానికి అనుమతివ్వాలని శుక్రవారం మెడికోలు పోలీసులకు వినతిపత్రం సమర్పించారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో, వారి వారి ఇళ్లకు వెళ్లి మంత్రి సహాయకుడు చంద్రశేఖర్‌ సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేశారు. వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొంది సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మంజూరైన చెక్కులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలు

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్‌ గేట్‌ రాజీవ్‌ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు మాటేటి ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి విధులకు వెళ్లేందుకు ఎల్లయ్య సైకిల్‌పై వెళ్తుండగా బైక్‌ ఢీకొంది. గాయపడిన ఎల్లయ్యను ఆస్పత్రిలో చేర్పించారు.

స్టాక్‌ మార్కెట్‌పై అవగాహన

సుల్తానాబాద్‌: స్టాక్‌ మార్కెట్లో ఒడిదుడుకులపై పెట్టుబడిదారులకు అవగాహన అవసరమని ఎంసీ ఏక్స్‌ మెటల్‌ అండ్‌ ఎనర్జీ సంస్థ ప్రతినిధి వెంకట కుమార్‌ అన్నారు. స్థానిక శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం మూలధన మార్కెట్లను అదుపు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

పీహెచ్‌సీ తనిఖీ

ముత్తారం: ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో పీడీ రవీందర్‌ తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని రిజిస్టర్‌ను పరిశీలించారు. మెడికల్‌ క్యాంపులు నిర్వహించాలన్నారు.



సుల్తానాబాద్‌రూరల్‌: పూజల్లో మహిళలు



గోదావరిఖనిటౌన్‌: సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



సుల్తానాబాద్‌: వాయినం ఇస్తున్న మహిళలు



రామగుండం: శ్రీసంతోషిమాతా ఆలయంలో..



ధర్మారం: ఆలయంలో కుంకుమ పూజలు

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

ఎలిగేడు: మండలంలోని శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

జూలపల్లి: జూలపల్లిలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, పెద్దాపూర్‌ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, కుమ్మరికుంట శ్రీకోదండరామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణమాస ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

సుల్తానాబాద్‌రూరల్‌: మండలంలో వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. కనుకులలో పూజారులు ఊటూరి శంకర్‌శర్మ, మహాదేవ్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నోము నోచారు.

సుల్తానాబాద్‌: మండల కేంద్రంలోని ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ గృహంలో పలువురికి వాయినాలు అందజేశారు.

ధర్మారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

గోదావరిఖనిటౌన్‌: గోదావరిఖని శ్రీకోదండ రామాలయంలో విశ్వహిందూ పరిషత్‌ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు మధుసూదనాచార్యులు, శశిధరచార్యులు వ్రతం నిర్వహించారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

ఓదెల: ఓదెల గ్రామంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శివాలయంలో ఓదెల మల్లన్న టెంపుల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సతీశ్‌ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అభిషేకం చేశారు.

కాల్వశ్రీరాంపూర్‌: మండలంలోని ఆయా గ్రామాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రామగుండం: శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు పరస్పరం పసుపు బొట్టు, వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధజలంతో అంటు వ్యాధులు దూరం అవుతాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని బాయమ్మపల్లెలో ఎమ్మెల్యే శుక్రవారం మాతృమూర్తి విజయలక్ష్మి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నిర్మించిన శుద్ధజల కేంద్రం ప్రారంభం, రూ.5లక్షల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్‌ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్‌ ఆళ్ల సుమన్‌ రెడ్డి, మాజీ వైస్‌ ఎంపీపీ పిట్టల రవికుమార్‌, మాజీ సర్పంచులు పడాల రాజు, తొల్పురి కొమురయ్య యాదవ్‌, మాజీ ఉపసర్పంచు గిరాం సాంబమూర్తి, నాయకులు సంపత్‌ పాల్గొన్నారు.

ఎలిగేడులో రైతు రుణమాఫీ సంబరాలు

ఎలిగేడు: రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ హామీని ప్రభుత్వం పూర్తి చేయడంతో ఎలిగేడులో రైతులతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు సంబరాలు జరిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్‌ కాంగ్రెస్‌ కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, నాయకులు అర్షనపెల్లి వెంకటేశ్వర్‌రావు, కొరుకంటి వెంకటేశ్వర్‌రావు, రంగు శ్రీనివాస్‌, కొండయ్య, పర్శరాములుగౌడ్‌, వెంకటసత్యం, రాయనర్సు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పాలనంతా మోసమే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు మధు, చందర్‌

పెద్దపల్లిరూరల్‌: మోసపూరిత హామీలతో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే తామేదో గొప్పపని చేసుకుంటున్నట్లు ప్రచారాలు చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్‌, కోరుకంటి చందర్‌ ఆరోపించారు. జిల్లా బీఆర్‌ఎస్‌ ఆఫీసులో శుక్రవారం వారు మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు చెప్తున్నదంతా వట్టిదేనన్నారు. నాయకులు గంట రాములు, రఘువీర్‌సింగ్‌, ఉప్పురాజ్‌కుమార్‌, రవీందర్‌, శ్రీనివాస్‌, తిరుపతి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఎన్టీపీసీ చేయూత



స్కాలర్‌షిప్‌ చెక్కు అందిస్తున్న చిన్మయిదాస్‌

జ్యోతినగర్‌: మహిళా సాధికారతకు సీఎస్సార్‌–సీడీ ద్వారా ఎన్టీపీసీ చేయూత అందిస్తోందని దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయిదాస్‌ అన్నారు. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌ సమీపంలోని లైఫ్‌స్కిల్‌ అకాడమీలో టైలరింగ్‌, బ్యూటీ షియన్‌ కోర్సులను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభావిత, పునరావాస ప్రాంతాల్లోని 50మంది మహిళల కోసం ప్రత్యేకంగా 3నెలల టైలరింగ్‌, బ్యూటీషియన్‌ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. బాలికా సాధికారత మిషన్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు సైకిళ్లు అందించారు. పదిలో మెరిట్‌ సాధించిన విద్యార్థులకు ఉత్కర్ష్‌ స్కాలర్‌షిప్‌ పంపిణీ చేశారు. ఏజీఎం(హెచ్‌ఆర్‌) బిజోయ్‌కుమార్‌ సిక్దర్‌, దీప్తి మహిళా సమితి ఉపాధ్యక్షురాలు జ్యోత్స్న త్రిపాఠి, రూపాసింఘారాయ్‌తో పాటు సీఎస్సార్‌ అధికారి సూర్యనారాయణ, ప్రతినిధులు వేముగంటి యుగంధర్‌రావు, శంకర్‌ పాల్గొన్నారు.

హిందూ ఐక్యవేదిక బంద్‌ ప్రశాంతం



జ్యోతినగర్‌: నినాదాలు చేస్తున్న ఐక్యవేదిక సభ్యులు



సుల్తానాబాద్‌లో..



రామగిరి: సెంటినరీకాలనీలో బీజేపీ నాయకులు



ధర్మారంలో మూసి ఉన్న దుకాణాలు

జ్యోతినగర్‌/రామగిరి/కాల్వశ్రీరాంపూర్‌/ఓదెల సుల్తానాబాద్‌/ఎలిగేడు/ధర్మారం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసనగా జిల్లాలోని గోదావరిఖని, రామగిరి, కాల్వశ్రీరాంపూర్‌, సుల్తానాబాద్‌, ఎలిగేడు, ధర్మారం, ఓదెల మండలాల్లో శుక్రవారం నిర్వహించిన బంద్‌ ప్రశాంతంగా ముగిసింది. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న హిందువులపై జరుగుతున్న హింసాత్మక మారణకాండ, దాడులను వ్యతిరేకించారు. వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసివేయించారు.

సంక్షిప్త వార్తలు

● **సింగరేణి క్వార్టర్స్‌లో చోరీ**

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఆర్జీ–2 ఏరియా పోతన కాలనీ సింగరేణి క్వార్టర్స్‌లో చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తాళం వేసి ఉన్న కార్మికుల క్వార్టర్లలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చొరబడ్డారు. లాగల అనిల్‌ ఉంటున్న 31బ్లాక్‌–427 క్వార్టర్‌ తాళం పగులగొట్టి, రూ.5 వేలు, దండు సురేశ్‌ ఉంటున్న 32 బ్లాక్‌ క్వార్టర్‌లోకి వెళ్లి, 8 తులాల వెండి పట్టీలు, 13 బ్లాక్‌లో బొట్ల సంపత్‌కు చెందిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. బాధితులు తమ కుటుంబసభ్యులతో కలిసి ఊళ్లకు వెళ్లారని, శుక్రవారం తెల్లవారుజామున చుట్టుపక్కలవారు గమనించి, సమాచారం ఇవ్వడంతో వచ్చారని పోలీసులు తెలిపారు. 31 బ్లాక్‌లోని 426, 428, 430 క్వార్టర్స్‌ తాళాలనూ దొంగలు పగులగొట్టారని, వాటిలో ఎవరూ నివాసం ఉండకపోవడంతో ఏమీ పోలేదన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

● **ట్రాఫిక్‌ సిగ్నల్స్‌పై నిర్లక్ష్యం వీడండి**

కోల్‌సిటీ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో వెలగని ట్రాఫిక్‌ సిగ్నల్స్‌పై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాష్ట్ర హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్‌ ఆరోపించారు. బల్దియా కమిషనర్‌ సీహెచ్‌.శ్రీకాంత్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని గాంధీచౌక్‌ ప్రధాన చౌరస్తా, మార్కండేయకాలనీ, మున్సిపల్‌ టీ జంక్షన్‌, ఎఫ్‌సీఐ ఎక్స్‌ రోడ్‌, మేడిపెల్లి సెంటర్‌లోని ట్రాఫిక్‌ సిగ్నల్‌ పని చేయడం లేదని తెలిపారు. మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, లేకుంటే ఆందోళన చేస్తామని తెలిపారు.

● **కాల్వశ్రీరాంపూర్‌లో వర్షం**

కాల్వశ్రీరాంపూర్‌: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు మేలు చేకూర్చిందని వ్యవసాయదారులు హర్షం వ్యక్తం చేశారు.

● **బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించండి**

మంథని: మంథని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సౌకర్యాలు కల్పించాలని డిపో మేనేజర్‌ శ్రవణ్‌కుమార్‌కు పెంద్రు సుమంత్‌రెడ్డి, సోంపల్లి నారాయణరావు, ముస్కుల జితేందర్‌రెడ్డి వినతిపత్రం అందించారు.

● **హెల్త్‌ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి**

పెద్దపల్లిరూరల్‌: రామగుండం కార్పొరేషన్‌లో హెల్త్‌ అసిస్టెంట్‌ కిరణ్‌ పారిశుధ్య కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నాడని నాయకులు గౌస్‌, మద్దెల దినేశ్‌ ఆరోపించారు. శుక్రవారం స్థానిక సంస్థల అడిషనల్‌ కలెక్టర్‌ అరుణశ్రీకి వినతిపత్రం ఇచ్చారు.

● **లక్ష్మీనరసింహుని సన్నిధిలో పూజలు**

జూలపల్లి: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి తన 65 వ పుట్టిన రోజును పురస్కరించుకొని పెద్దాపూర్‌ శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేవైఎం సీనియర్‌ నాయకులు కంకణాల జ్యోతిబసు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు.

● **మాజీ ప్రధాని వాజపేయికి నివాళి**

పెద్దపల్లిరూరల్‌: భారత మాజీ ప్రధాని వాజపేయి వర్ధంతి సందర్భంగా పెద్దపల్లిలో శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

● **పారిశుధ్య కార్మికుల వేధింపులపై విచారణ చేపట్టండి**

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో కార్మికులపై జరుగుతున్న వేధింపులపై విచారణ జరిపించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎం.ఏ.గౌస్‌, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దెల దినేశ్‌ కోరారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ అరుణశ్రీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

● **ఆమె నేత్రాలు సజీవం**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్‌ సంతోష్‌నగర్‌కు చెందిన బొద్దుల రమ (40) శ్వాసకోస సంబంధిత సమస్యలతో గురువారం రాత్రి మృతి చెందారు. కుమారులు సాయికిరణ్‌, సాయి గణేశ్‌ మృతురాలి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్‌ జాతీయ గౌరవ సలహాదారుడు నూక రమేశ్‌, రాజా మహేందర్‌ రెడ్డి ఆధ్వర్యంలో టెక్నీషియన్‌ ఆరిఫ్‌ మృతురాలి నేత్రాలను సేకరించి ఐ బ్యాంకుకు తరలించారు.

● **రోగులకు పండ్లు పంపిణీ**

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఐటీఐ వాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.

● **బీసీ సదస్సును విజయవంతం చేద్దాం**

పెద్దపల్లిరూరల్‌: సమగ్ర కుల జనగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం సంఘం నాయకులతో కలిసి పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. పెద్దపల్లిలో ఈనెల 20న నిర్వహించనున్న సదస్సు విజయవంతం చేయాలని కోరారు.

● **పోస్టర్‌ ఆవిష్కరణ**

కమాన్‌పూర్‌: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌ వద్ద ఈ నెల 20న నిర్వహించే బీసీ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బీసీ సంఘాల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో పోస్టర్‌ ఆవిష్కరించారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

● **హ్యూమన్‌రైట్స్‌ కౌన్సిల్‌ రాష్ట్ర వైస్‌ చైర్మన్‌గా లక్ష్మారెడ్డి**

సుల్తానాబాద్‌రూరల్‌: సోషల్‌ జస్టిస్‌ ఫర్‌ వరల్డ్‌ హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ రాష్ట్ర వైస్‌ చైర్మన్‌గా సుల్తానాబాద్‌ మండలం సాంబయ్యపల్లికి చెందిన కస్తూరి లక్ష్మారెడ్డిని నియమించినట్లు రాష్ట్ర చైర్మన్‌ నోముల సంపత్‌కుమార్‌ తెలిపారు.



కమాన్‌పూర్‌: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్‌ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి అంగడి బజార్‌ వద్ద నూతన తాగునీటి పైపులైన్‌ ఏర్పాటు చేస్తున్నారు. ఐదురోజుల నుంచి పైపులైన్‌ పనులు జరుగుతున్నాయి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రహదారి అస్తవ్యస్తంగా మారడంతో కార్యాలయాలకు వెళ్లే వాహనాలు, దారి వెంట వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పనులు వెంటనే పూర్తి చేసి దారి బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- మధు, మిషన్‌ భగీరథ ఏఈ, ఫోన్‌ నంబర్‌ 63099 54355

వాట్సప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్‌ : 94403 81258

గని ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌

గోదావరిఖని: గని ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు అంకిత భావంతో ముందుకు సాగాలని ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్‌ అన్నారు. జీడీకే–1వ గనిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు రక్షణపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. ప్రమాదాల్లేని గనిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. పనులు చేసేటప్పుడు సురక్షితమైన పద్ధతులు, విధానాలను అమలు చేయాలని సూచించారు. అనంతరం భూగర్భ గనిలో దిగి తనిఖీ చేశారు. ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్‌, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్‌రావు, మేనేజర్‌ రమేశ్‌ బాబు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గని నుంచి మణుగూరుకు బదిలీపై వెళ్తున్న సంక్షేమ అధికారి ఓంకార్‌ బాబును గురువారం గని ఆవరణలో సన్మానించారు. గని పిట్‌ కమిటీ సెక్రెటరీ బొంత రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గని మేనేజర్‌ రవి కిరణ్‌, అధికారులు, ఇంజనీర్లు, ఫోర్‌మెన్లు, బ్రాంచ్‌ కమిటీ నాయకులు, సేఫ్టీ, మైన్స్‌ కమిటీ సభ్యులు టెక్నీషియన్లు, ఏఐటీయూసీ నాయకులు సతీశ్‌, సంపత్‌, రోహిత్‌రెడ్డి, శ్రీను, రాకేశ్‌, నాగరాజు, మనోహర్‌ పాల్గొన్నారు.

విద్యుత్‌ సంస్థ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

పెద్దపల్లిరూరల్‌: విద్యుత్‌ సంస్థను ప్రైవేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2022లో విద్యుత్‌ సంస్కరణల పేరిట చట్టాన్ని తెచ్చి ప్రైవేటీకరణకు తెరలేపిందన్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌, మహారాష్ట్ర, హర్యాన, పాండిచ్చేరిలో ప్రైవేటీకరిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని ఉద్యోగులు, కార్మికులు, అధికారులంతా వ్యతిరేకించడంతో విరమించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. నాయకులు భిక్షపతి, రవీందర్‌, వాగునాయక్‌, నర్సయ్య, జగన్‌, బాలయ్య, సదానందం, అశోక్‌, విజయ్‌ ఉన్నారు.

వనరుల లభ్యత ఉన్నచోటే విద్యుత్‌ కేంద్రం స్థాపించాలి



వినతిపత్రం అందజేస్తున్న కందుల సంధ్యారాణి

రామగుండం: ఉత్పాదక వనరులు ఉన్న ప్రాంతంలోనే నూతన విద్యుత్‌ కేంద్రం స్థాపిస్తే నాణ్యమైన విద్యుత్‌ తక్కువ ధరకు ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. శుక్రవారం రామగుండం బీ–థర్మల్‌ కేంద్రాన్ని సందర్శించి అతిథి గృహానికి చేరుకున్న జెన్‌కో డైరెక్టర్లను ఆమె కలిసి వివిధ అంశాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. జెన్‌కో ఆధ్వర్యంలోనే నూతన విద్యుత్‌ కేంద్రం స్థాపించడంతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. రామగుండంలో జెన్‌కోకు చెందిన ఖాళీ స్థలంలోనే నూతన విద్యుత్‌ కేంద్రం స్థాపించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రతినిధులు మిట్టపల్లి సతీశ్‌, బర్పటి నారాయణ, కూర వెంకటేశ్‌, కుమార్‌ ఉన్నారు.

విద్యుత్‌ కేంద్రాన్ని జెన్‌కోతోనే నిర్మించాలి

రామగుండంలో జెన్‌కోకు చెందిన స్థలంలో అదే సంస్థతో నూతన విద్యుత్‌ కేంద్రం స్థాపించి ఉద్యోగుల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని టీఎస్‌ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్స్‌ ఎంప్లాయిస్‌ రిటైర్డ్‌ ఎంప్లాయిస్‌ సన్స్‌ అండ్‌ డిపెండెంట్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు అహ్మద్‌బాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం జెన్‌కో అతిథి గృహంలో డైరెక్టర్ల బృందాన్ని కలిసి పలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రజాక్‌, ముజాహిద్‌, వాజిద్‌, నిజాం, తౌఫిక్‌, అఫ్సర్‌, అయ్యూబ్‌, నిస్సార్‌, అమీర్‌ ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సారయ్యగౌడ్‌

కాల్వశ్రీరాంపూర్‌: మండలంలోని మొట్లపల్లి ఆర్‌ అండ్‌బీ రోడ్డు నుంచి మానేరు తీరం వరకు రహదారి నిర్మాణ పనులను శుక్రవారం మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌ ప్రారంభించారు. సీడీఎఫ్‌ నిధుల నుంచి చేపట్టిన ఈ రహదారి నిర్మాణంతో వ్యవసాయదారులకు, తాగునీటి సరఫరా మోటటా వరకు వెళ్లేందుకు ప్రయోజనకరంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌కు రైతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచులు కోమల మల్లమ్మ, గోనె శ్యాం, నాయకులు శ్రీపతి రాజ్‌కుమార్‌, రాంప్రసాద్‌, ఐలయ్య, శ్రీనివాస్‌, లింగయ్య, సంపత్‌, హరీశ్‌ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

జూలపల్లి: మండలంలోని ధూళికట్టలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండల వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని సూచించారు.